# పగిలిన అద్దం

## శ్రీ వాకాటి పాండురంగరావ్

**21** వ నెంబరు బస్సుకు గర్వం ఎక్కువ.

తనకు విద్యాగంధం ఉందని కాబోలు.

పువ్వుతోబాటు నారకు వాసన వస్తుందన్న సామెతనా బస్సు ఎక్కడో విని ఉంటుంది !

యూనివర్సిటీనుండి కరోల్బాగు వైపుకూ, కరోల్బాగు మీదుగా యూనివర్సిటీకి వెళ్తుంది 21 వ నెంబరు బస్సు. చదివేవారినీ చదివించేవారినీ చదువుల చోటుకు తీసుకువెళ్తున్నాననీ కాబోలు గర్వం. ఆ గర్వంకొద్దీ అపుడపుడు ముందడుగు వేయక బైఠాయిస్తుంటుంది ఈ బస్సు—

అని ముకుందం అనుకుంటూండగా ఆ బస్సు కనాట్ప్లేస్ మలుపు తిరగబోయింది. కాని తిరగకుండా ఠాక్కున ఆగింది. ముకుందం బస్సు కిటికీలోనుండి బయటికి చూస్తే వేగం పాలిటి యముడు ఎఱ్ఱదీపం వెలిగిఉంది. ఆ వెలుగు అర నిముషం మాత్రమే.

ముకుందం గుండె వేగంగా కొట్టుకోసాగింది.

బస్సు పంచ్కుయిన్ రోడ్డుమీద నడుస్తుంది. దాని వేగం హెచ్చింది.

అతడి ఒళ్ళంతా కళ్ళయింది.

ఆస్పత్రి గుమ్మమూ, పెద్ద పెద్ద ఫర్నిచర్ షాపులూ, రామకృష్ణాశ్రమమార్గమూ, పహాడ్గంజ్ ఠాణా అన్నీ వెనక్కు వెళ్ళిపోయాయి.

'లింక్ రోడ్ కోయీహై ?" అని అరిచాడు కండక్టర్.

"హై హై !" అని బస్సులో ఎందరో అరిచారు—

అన్పించింది ముకుందానికి. కాని ఒక్కరు కూడా అట్లా అరవలేదు.

లింక్ రోడ్ స్టాప్ వద్ద ఆగకుండానే సాగింది బస్సు.

ఆశ్చర్యపడి, కోప్పడి, బాధపడి—అంతలోనే అవనీ మరిచిపోయి, కిటికీలోనుండి బస్ స్టాప్కు కొద్ది దూరంలో ఉన్న పండ్ల దుకాణం వైపు చూశాడు ముకుందం.

ఉంది ! ఆఅమ్మాయి ఉంది.

రకరకాల పండ్ల మధ్య పారిజాతపుష్పంలా కూచుని ఉంది. నవ్వుతూ ఎవరికో పండ్లు అమ్ముతూ ఉంది !

ఆ దృశ్యాన్ని బస్సు కిటికీలోనుండి అయిదు సెకండ్లయినా చూడలేదేమో ముకుందం. కాని మనసులో ఆ దృశ్యాన్ని చూసుకోవడానికి కళ్ళతో పనిలేదుగా. ఇవాళ అర్జెంటుగా హోటలు చేరి తీరాలి కనుక, పరుగెడుతున్నాడు గాని, లేకపోతే దిగి కనీసం నాలుగు అరటిపండ్లన్నా కొనుక్కునేవాడే ! అక్కడినుండి బస్సు దొరక్కపోతే హోటలుకు నడిచేవాడే !

ముకుందం మనసులోని ఈ అనుభవానికి వయసు ఎంత, వందరోజు లుంటుందేమో. ఒకనాడు యూనివర్సిటీలో తా నెక్కిన బస్సు లింక్ రోడ్ దగ్గర ఆగిపోయి—ఇహ ముందుకు కదలనని మొండికేస్తే చచ్చినట్లు అందరితో బాటు తానూ దిగాడు. యథావిధిగా ఢిల్లీ బస్సువాళ్ళని దీవిస్తూ, మరుసటిరోజు దినపత్రిక సంపాదకుడికి తను రాయబోయే ఘాటయిన లేఖలోని వాక్యాలను నిర్మిస్తూ నిల్చుని ఉంటే—కొన్ని గజాల కవతల కనపడింది ఒక పండ్ల దుకాణం.

కమలా, ద్రాక్ష, ఆపిల్, సపోటా, లాచీ, అరటి—మొదలయిన పళ్ళు చిన్నచిన్న గంపలనిండా ఉన్నాయి. ఒక అమ్మాయి వాటి నమ్ముతున్నది. ఆమెకు పదహారేళ్ళుంటాయేమో. దారి వెంబడి వెళ్ళేవారిలో ఎవరన్నా తమ దుకాణంవైపు చూచి ఏదయినా కొంటారేమోనని అందరివైపు చూస్తూ, ఎవరన్నా అటు చూస్తే చాలు మొహమంతా చిరునవ్వు చేసుకు వాళ్ళని పిలుస్తూ, వాళ్ళు బేరమాడ్డం మొదలెడితే తమకి గిట్టే రెండు పైసల లాభం వివరిస్తూ ఆ పండ్ల నిటు ఇస్తూ ఈ చిల్లర నటు పడేస్తూ, మధ్యమధ్య ఒక అయిదేళ్ల అబ్బాయి—తమ్ముడు కాబోలు వాడిని సముదాయిస్తూ చెంగుచెంగున లేడిపిల్లలా గెంతుతూ ఉన్నది ఆ అమ్మాయి.

ఆమె కాదు కాని, ఆమెలోని ఒక ప్రత్యేకత ముకుం దాన్ని ఆకట్టుకుంది.

ఆమె అందమయినదీ కాదు. నూనె రాయని జుత్తు. కడగని మొహం. ఉతికి చాల కాలమయిన చీర. భయంకర మైన వంగ రంగు కుంకుమబొట్టు మోచేతిదాకా రంగు రంగుల గాజులు.—ఇవన్నీ కూడా నాజూకైన అభిరుచిని చెదర గొట్టే పదార్థాలు.

మరి యూనివర్సిటీ లెక్చరర్ ముకుందం యొక్క బెదరును పోగొట్టి అతడి కుతూహలాన్ని ఆకర్షించింది. అంటే, ఆ ఆకర్షణ ఆ అమ్మాయిలో ఒక ప్రత్యేకతే గాని ఆమె మాత్రం కాదనే అనుకోవాలి.

ఏమిటి ఆ ప్రత్యేకత ?

ఆ అమ్మాయికి తల్లి ఉన్నట్టు కనిపించదు. తండ్రి ముసలివాడు. ఎప్పుడూ దగ్గుతూనో బీడీ తాగుతూనో—కాస్త వెనకప్రక్కగా పాత నులకమంచంమీద కూర్చొని ఉండేవాడు వాళ్లకు వేరే గుడిశె అంటూ ఉన్నట్లు లేదు. ఆపాత మంచంమీద మాసిన పడకా, మంచంక్రింద నాలుగు కుండలూ —ఇవే వాళ్ల ఆస్తి.

దుకాణమూ వీధిమీద ఉంది. వర్షం వస్తే వ్యాపారం ఉండదు. ఏ క్షణాన్నయినా పోలీసులో మున్సిపాలిటీవారో వచ్చి దుకాణాన్ని ఎత్తివేస్తే ఆ ముగ్గురికి పొట్ట గడవదు. కళ్లు కానక ఏ లారీయో, బస్సో కాస్త ప్రక్కకు మళ్లితే వాళ్లకు చావు తప్పదు. ఇదీ వాళ్ళు జీవిస్తున్న వాతావరణం. ఇన్ని ప్రమాదాలలో ఏ ఒక్కటి ఉన్నా చాలు మన మనసు శాంతిని కోల్పోయి యమయాతన పడుతుంది. కాని, ఆ అమ్మాయి అసలు ఈ అప్రశుతుల ఉనికిని గుర్తించినట్లేలేదు. తమ జీవితాలలో 'రక్షణ' అన్న గుణం క్షణక్షణానికి ప్రాణం పోసుకుంటుందన్న బాధ కన్పించలేదా అమ్మాయిలో. తాను బళ్లకు వెళ్లి పెద్దగా చదువుకొని ఏదో అయిపో వచ్చునే, అట్లా కాకపోతినే అన్న దిగులు కన్పించదా అమ్మాయిలో.

ఆడపిల్ల ఆడదిగా అయ్యే వయసున అట్లా రోడ్డు మీద కూచుని ఎందరో మగవారి ఎన్ని రకాల చూపులకో ఎర అవుతూ, వయసు తనలో తెచ్చే మార్పుల్ని గుర్తించి అందు నిమిత్తం మనసులో కల్పించుకోవలసిన పరదాల విషయమే తెలియకుండా మసలుతూ, ఎంతమంది ఎక్కువగా తమ దుకా ణము నుండి పండ్లను కొంటే తమకంత మంచిదన్న ఒక నిజమే ఊపిరిగా బ్రతుకుతూ, చందమామను చూచిన పాపాయి మొహాన ఉదయించే చిరునవ్వును నవ్వుతూ, నలు గురిచే 'మంచి' గుర్తింపబడి ఆకాశాని కెత్తబడిన క్షణాన సిగ్గుతో ఒకవిధమైన జన్మసాఫల్య భావంతో మంచి మనిషి నివ్వే చిరునవ్వును నవ్వుతూ ఉండేది ఆ అమ్మాయి.

ఎల్లప్పుడూ ఆ చిరునవ్వుతో, ఆ వెలుతురుతో ఆ చైత న్యంతో ఉండే ఆ గుణం ఆకర్షించింది ముకుందాన్ని .కాని, మాటలు జడిసే సరిహద్దు ఇది. పదాలు బెదిరే ప్రాంత మిది. అందుకనే ఎవరన్నా గనుక ముకుందాన్ని నిలవేసి 'ఆ అమ్మాయిపట్ల ఏమిటి నీ మోజు'!—అని అడిగితే అతడు తెల్లమొహం వేయక తప్పదు. ఒకవేళ ఎట్లాగో అతడు ఈ భావాలను పదాలలో బంధించి అందించినా విన్నవారు నవ్వు తారు. తప్పక పిచ్చికోసం వెతుకుతారు కాని అదృష్టవశాత్తు అతడి నెవరూ అడగాలేదు. అతడూ చెప్పాలేదు.

సాధ్యమయినంతవరకు ముకుందం ఆ బస్ స్టాప్ వద్ద దిగి ఏదో పండ్లను కొనేవాడు. ఆ అమ్మాయిని వాళ్ల నాన్నను పలకరించేవాడు. వాళ్ల నాన్న దగ్గు కేవేవో హోమియోపతి మందులను సూచించేవాడు. వాళ్లకూ, అతడికీ మధ్య ఒక వింత బాంధవ్యం అల్లుకుంది.

రోజూ రాత్రిపూట హోటలువాడు భోజనం అంటూ పెట్టే గడ్డి తర్వాత పండ్లను తాను తిని కొన్ని రూంమేటు రఘుపతి కిచ్చేవాడు ముకుందం.

అట్లాంటిది తాను ఈనాడు బస్సు దిగకుండానే, ఆ దుకాణాన్ని అర నిముషమన్నా చూడకుండానే మొట్టమొదటి రోజునుండి నేటిదాకా పెరుగుతూ వచ్చిన బాంధవ్యాన్ని అతడు సమీక్షించగలిగితే—అందులో వింత ఏమీ లేదు !

ఇంకో రెండు వారాల తర్వాత దసరా సెలవులు వచ్చాయి ముకుందం తన వూరికి బయలుదేరాడు. వెళ్తూ వెళ్తూ పది హేను రూపాయలకు బుట్టనిండా పండ్లు కొని తీసుకు వెళ్లాడు.

సెలవు లయింతర్వాత ఒక ఆదివారంనాడు మళ్లీ ఢిల్లీలో దిగాడు.

ఆ సాయంకాలమే హోటలునుండి బయలుదేరాడు. తిన్నగా నడుచుకుంటూ వెళ్లాడు ఆ పండ్ల దుకాణానికి.

"రండి బాబూ రండి ! చాలారోజులు కనపడలేదు."

"అవును, మా వూరికి వెళ్లాను. ఇవాళే వచ్చాను."

"మీ వూళ్లో గోధుమలు బాగా దొరుకుతున్నాయా బాబూ ?" అని అడిగాడు ముసలివాడు.

"ఆ .... గోధుమలకేం, బాగానే దొరుకుతున్నాయి. కాని మేము తినేది బియ్యం కదూ, దానికే కాస్త యిబ్బందిగా ఉంది." అన్నాడు ముకుందం నవ్వుతూ.

"మరే, ఏది కావాలో అదే దొరకదు బాబూ !"

ఈ సంభాషణ జరిగినంతసేపూ ఆ అమ్మాయిని కళ్లతో వెతికిన ముకుందం, ఇక ఉండబట్టలేక ముసలాడి ప్రక్కన ఉన్న చిన్న కుర్రవాడిని చూపించి అడిగాడు" వీడి అక్కయ్య ఏమయిందీ ? దుకాణంమీద లేదే, ఒంటో బాగులేదా ?" అన్నాడు, వీలయినంతవరకూ 'ఆఁ ఆ ! అమ్మాయి ఏమయితే నాకేంలే'—అన్న ధ్వని స్ఫురించేటట్లు.

"బాబూ—ఆడపిల్ల ఏనాడయినా ఇంకొకరి ఇంటి సొత్తే కదా ? ఈమధ్యనే ఒక సంబంధం వస్తే పెళ్లిచేసి అత్తారింటికి పంపేశాను .... మరి తమకు ఒక డజను అరటి పళ్లిమ్మంటారా లేక ఆపిల్స్ ఇమ్మన్నారా ?"

"ఆ ! ఆ !" అన్నాడు పండ్ల విషయం చెవి కెక్కని ముకుందం.

ఆ ముసలివా డిచ్చిన ఏవో పండ్లను తీసుకుని అతడి చేతికి ఏదో నోటు ఇచ్చి, అతడు వెనక్కిచ్చిన చిల్లర తీసుకుని —మనసులోనూ, మహా నగరంలోనూ చీకటి అలముకుంటుం డగా తన గది చేరాడు ముకుందం.

ముచ్చటగా పెరుగుతూ వచ్చి మొగ్గ తొడిగిన మొక్క నెవరో పీకివేసినట్లయింది.

ఆ రాత్రి రఘుపతి ఆశ్చర్యపోయాడు." అయినా ఒక్క డజను అరటిపండ్లు ఎందుకు తెచ్చావోయ్ ?"

"ఆ ?" అన్నాడు ముకుందం.

"కొంపతీసి పెళ్లిచూపుల్లో ఏమన్నా పాల్గొన్నా వేమిటి ఈ సీజన్లో—:'

తల ఆడించాడు ముకుందం.

"చచ్చాం ఫో ! .... నాయర్‌గాడికి ఒక ఖాతాదారు నష్టం ! పూర్ బర్డ్!!" అని రఘు రెం డరటిపళ్లు ఆరగించి ముకుందాని కొకటి ఇచ్చాడు. అతడు వద్దన్నాడు.

రఘుపతి వెళ్లిపోయాడు.

ముకుందం లేచి హొటల్ డాబామీదికి వెళ్లి నిల్చు న్నాడు. దూరంగా ఎత్తుగా ఎర్రగా వెలుగుతున్నాయి ఏదో రేడియో కంపెనీ పేరును పలుకుతున్న దీపాలు. క్రిందుగా వీధిలో—కారుల రొద. ఆకాశంనిండా నక్షత్రాలు. పల్చటి మంచుతెర. చీకటి. దీపాలు. జంకుతున్న చంద్రుడు. జుత్తు మాత్రం కన్పడుతున్న మనుష్యులు.

"ఆ అమ్మాయి మొగుడు ఎవడు ? ఎట్లాటివాడు ?"

హుం ! ఇం కెట్లాటివా డవుతాడు. డబ్బే దైవమయిన ఈ లోకంలో గుణాన్ని గుర్తించేవా డెవడు ? కట్నాలకు డబ్బు ఎక్కడనుండి తెస్తాడా రోగిష్టి ముసలివాడు—ఆ అమ్మాయి జీవితం ఏ రెండోపెళ్లికో అంకితమయి ఉంటుంది. లేదా, జీవితాన్ని నవ్వుతూ జీవించగల ఆ అమ్మాయిని కొట్టో తిట్టో హింసించి ఆమె నవ్వును చంపివేయగల రాక్షసుడికి ఆమె భార్య అయిఉంటుంది. భగవాన్ ! అడవిలో వెన్నెల లాగున, ఎవరికీ అర్థం కాని చోట ఈ ఔన్నత్యమేల ? ఇదంతా నీకు ఆట అనుకోవాలా ? లేక ప్రపంచంలో నవ్వూ చైతన్యమూ 'ఎక్సైజ్' అయిందనుకున్నావా ?

అని గింజుకున్నాడు ముకుందం.

ఆలోచించాడు ముకుందం—

ఆ వలయంలోనే పరిభ్రమించాడు ముకుందం.

—రోజులు గడవసాగాయి.

అపుడపుడు అతడి మనసు ముందు నవ్వు మాయ మయిన మొహంతో ఆ అమ్మాయి నిలిచేది. హఠాత్తుగా ఏదో శవం వచ్చి మీద పడ్డట్లుగా వణికేవాడు ముకుందం. మళ్లీ స్మృతుల సుడిగుండాలలో పడి ఈదసాగేవాడు.

ఎందుకో ఒకనాడు అన్పించింది.

ఆ అమ్మాయి ! ఆ అమ్మాయిని తాను పెళ్లిచేసుకుని ఉంటే ? తనకే ఆ ధైర్యం ఉండి ఉంటే ?

మరి, మరి .... అయితే మరి తనెప్పుడూ ఆ అమ్మాయిని అసలా దృక్పథంతో చూడందే—

అబ్బే, అది కాదు విషయం. తన ఊహ కొక అలౌ కికానందమిచ్చే ఆ అపురూపమయిన వస్తువు ఒకనాడు అదృశ్య మయిపోతుందని తాను అనుకోలేదు.

ఆమెలోని ఆ మెరుపుని, చిరునవ్వుని గుర్తించి దానిని తన ప్రాణంగా పోషించి, అమూల్యమైన వస్తువుగా గుండెల్లో దాచుకుని, ఆ సుగంధాన్ని ప్రపంచమంతటా పరిమళం పంచగల పారిజాత వృక్షంగా చేసి, ఆ తీగ పలికే తియ్యటి పలుకు నొక మధుర రాగంలా దిగంతాలకు ఆలపించి, ఆ చిన్న ప్రమిదను ఆకాశానికి అందమిచ్చే వెలుతురుగా చేసి, ఆ ఆరాధ్య దైవానికి తానొక అర్చకుడయి ఎంత ధన్యత పొందిఉండేవాడు తను !

ఆమె వంటిది ఆమె ఒక్కతే. ఆమెను చదవగల్గినది తా నొక్కడే ! కాని అదను దాటిపోయింది.

తనకా ధైర్యం లేకపోయింది.

ధైర్య మేమిటి—వివాహం అన్న అవకాశాన్ని మరిచే పోయా డతను.

ఇపుడు సమయం ఎగిరిపోయింది.

వజ్రం బూడిద కడుగున పడిపోయింది.

## పగిలిన అద్దం

సుకుమారమైన కుసుమం బాటమీద రాలింది.

ముచ్చటగా ఎగరగల పావురాయి ఏదో పంజరంలో ఇరుక్కుంది.

ఇంతటి దారుణం జరగకుండా అడ్డుపడ గల్గినవాడు తాను. వజ్రాన్ని బంగారంలో పొదిగి, కుసుమాన్ని శిరస్సున దాల్చి, పావురాయిని ఆకసంలో ఎగరనిచ్చి—ఆనందాన్నిచ్చి పుచ్చుకోగలిగిన వ్యక్తి తాను.

కాని ఏం లాభం ? శాపగ్రస్తుడైన దుష్యంతుడిలా ఉండిపోయాడు తను.

శకుంతలా వెళ్లిపోయింది ఆమె. ఎక్కడికో ?

—అన్పించేది ముకుందానికి ....

ఈ లోపుగా వేసవి వచ్చింది.

పరీక్ష లనబడే బరువయిన రోజులు వెళ్లిపోయాయి.

ఉత్సాహంతో తమ తమ నెలవులకు బయల్దేరారు విద్యార్థి జనం.

ఆటే జనం రావడంలేదని 21 వ నెంబరు బస్సు కాస్త నొచ్చుకుంది.

ఊరికి రైలెక్కిపోయే ముందురోజు రాత్రి ఒక హిందీ సినిమాకు వెళ్లాడు ముకుందం.

ఈ రోజులలో ఆడపిల్లల జడ ముడులవలె, మొహెంజదారో శిధిలాలమీద లిపి వలె—అదోకలా ఉండింది ఆ సినిమా.

కాని, ఇటువంటి సినిమాలో కూడా, తెరమీద పాట వస్తే కూడా గొంతు కలిపి, ఆట వస్తే ఆనందించి, హాస్యం వస్తే చప్పట్లు కొట్టి, కథానాయికి కన్నీళ్లు పెడితే బాధ పడి—ఇట్లా క్షణక్షణమూ ఆ సినిమాను సంతృప్తితో సంపూర్ణంగా అనుభవిస్తూ తన ముందు కూర్చున్న దంపతులు కొంత చిరాకు కలిగించారు. ముకుందానికి.

'అసలే చెత్త ఫిల్మ—అందులో వాళ్ల దొక పిడకల వేటా !—' అనుకొన్నాడు ముకుందం.

ఇంటర్వెల్ కొక ఐదు నిముషాల ముందుగా బయటికి నడిచాడు.

మళ్లీ జనమంతా లోపలికి ఎగబడడానికి ముందరే లోపలికి వచ్చాడు. తన కుర్చీలో కూర్చోబోతూ ముందు వరుసలోని దంపతులను పరీక్షగా చూశాడు.

ఆమె !!

ఆమె, ఆ పండ్లమ్మిన అమ్మాయి ! ఆమె ప్రక్కన పాతికేళ్ల యువకుడు, బాగానే ఉన్నాడు. బట్టలు చూస్తే ఏదో గుమాస్తాలా ఉన్నాడు. మొగుడు కాబోలు !

దీపాలు ఆరాయి.

ముకుందం లేచి గబగబా సినిమాహాలు విడిచి బయటికి వచ్చాడు.

లోపల సినిమాలో భోరుమంటూ మొదలయింది. ఒక యుగళగీతం.

ముకుందం హొటలువైపు నడవసాగాడు—ఒంటరిగా.



